క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునఃనిర్మాణానికి శానంబట్ల పంచాయతీకి చెందిన తూకివాకం చంద్రారెడ్డి రూ.50 వేలు, తూకివాకం ప్రభాకర్ రెడ్డి రూ.25 వేలు విరాళం ఇచ్చారు. నగదును శుక్రవారం ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. ఆయన వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సినీ గాయకురాలు మంగ్లీ దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

భాకరాపేట సీఐగా సురేంద్రరెడ్డి



భాకరాపేట: భాకరాపేట సీఐ గా సురేంద్రరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ తులసీరామ్ రాయచోటికి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో తిరుపతి కంట్రోల్ రూమ్‌లో ఉన్న సీఐ సురేంద్రరెడ్డి భాకరాపేటకు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు, ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

తిరుపతిలో అభివృద్ధి పరుగులు



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి తుడా: తిరుపతి నగరం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ఆపరేషన్ భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం అనుకున్న సమయానికి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. నగరంలోని 50 డివిజన్లలో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో తిరుపతి అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

కొనసాగుతున్న అకాడమిక్ కన్సల్టెంట్స్ నిరసన



ఎస్వీయూ పరిపాలనా భవనం వద్ద నిరసన తెలుపుతున్న అకాడమిక్ కన్సల్టెంట్లు

తిరుపతి సిటీ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్వీయూ అకాడమిక్ కన్సల్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం కూడా కొనసాగింది. అకాడమిక్ కన్సల్టెంట్స్ వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. 110 జీవోను వెంటనే అమలు చేయాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సహాయ నిరాకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిరసన ఆపివేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం





గంగమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న భక్తులు, గంగమ్మకు దర్శించుకున్న ప్రముఖ గాయని మంగ్లీ, గోపూజ చేస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా సామూహిక వరలక్ష్మి వ్రతం చేపట్టారు. డెప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య, కమిటీ సభ్యులు క్రిష్ణమ్మ, ఎస్.భారతి పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న గాయని మంగ్లీ

తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకోవడం మహద్భాగ్యమని ప్రముఖ గాయని మంగ్లీ తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన ఆమె శుక్రవారం సంప్రదాయబద్ధంగా గంగమ్మను దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య స్వాగతం పలికారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి చెల్లెలుగా పూజలందుకుంటున్న అమ్మవారి జాతర సంబరాల సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి చొరవతో అమ్మవారి విశిష్టతను చాటి చెప్పే పాటను పాడే అదృష్టం తనకు దక్కిందన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నడవలూరు గ్రామంలో అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన చేశారు. అనంతరం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. విశేషంగా అలంకరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి హాజరై అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచి గణపతిరెడ్డి, నెన్నూరు డివిజన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దామోదర్ రెడ్డి, తనూజ, యోగానందరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో..

చిన్నగొట్టిగల్లు మండలంలోనూ వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా జరుపుకున్నారు.

జగన్నాథ్ అలర్జీ, చెస్ట్ ఆస్పత్రి ప్రారంభం



హాస్పిటల్ అధినేతలను అభినందిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం రెడ్డిరెడ్డి కాలనీలోని శ్రీ జగన్నాథ్ అలర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌ను ఖాదీకాలనీలోని నూతన భవనంలో శుక్రవారం పునః ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ తిరుమల తల్లి అన్నపూర్ణమ్మ హాజరై హాస్పిటల్ నూతన భవనాన్ని ప్రారంభించారు. మేయర్ శిరీష మాట్లాడుతూ అధునాతన సదుపాయాలతో నూతన భవనంలో డాక్టర్ తిరుమల, డాక్టర్ యామిని హాస్పిటల్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. డాక్టర్లు హరిబాబు, సతీష్‌చంద్రరెడ్డి, అజయ్‌బాబు, మునిశేఖర్, మధుసూదన్‌రెడ్డి, రమేష్, నరేంద్ర, తిరుపతిలోని ప్రముఖ వైద్యులు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

లోకేష్ రౌడీయిజాన్ని రెచ్చగొడుతున్నాడు



ఎస్‌కే మస్తాని

తిరుపతి సిటీ: నారా లోకేష్ లోకజ్ఞానం తెలియని వ్యక్తి అని, అతడి మాటలను ప్రజలు పట్టించుకోరని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్‌కే మస్తాని పేర్కొన్నారు. శుక్రవారం ఆమె తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, నారా లోకేష్ అండ్ కో ప్రజలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. చంపుతాం, అంతుచూస్తాం అని మాట్లాడడం రౌడీయిజాన్ని ప్రోత్సహించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మనస్సును చూరగొన్న వ్యక్తి సీఎం జగన్ అని, వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు గెలిచి టీడీపీని నామరూపాలు లేకుండా చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు బోండా ఉమా, అయ్యన్న పాత్రుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించకతప్పదన్నారు.

వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మర తనిఖీలు



తిరుపతి క్రైమ్: తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జయ నాయక్ శుక్రవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. గంజాయి విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సీఐ తన పరిధిలోని పలు ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

నేడు మహతిలో ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, గానాలాపన



మాట్లాడుతున్న ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధి దిగ్విజయ్

తిరుపతి కల్చరల్: ప్రేరణ హెల్పింగ్ సొసైటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మహతి కళాక్షేత్రంలో శనివారం ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య, గానాలాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ సొసైటీ సభ్యులు దిగ్విజయ్, దిలీప్, తరుణ్ తెలిపారు. వారు శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ సంస్థ 2007లో స్థాపించినప్పటి నుంచి పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ వృద్ధులు, అనాథ పిల్లలకు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు. వార్షికోత్సవం నాడు ప్రత్యేక ప్రతిభావంతులతో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు నృత్యాలు, గానాలాపన నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో దివ్యవాణి, అనిత, ఫణీంద్ర, లక్ష్మి, ప్రియ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర ప్రతినిధులు



గవర్నర్‌ను కలసి వినతి పత్రం ఇస్తున్న ఏబీఆర్‌ఎస్‌ఎం సభ్యులు

తిరుపతి సిటీ: అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ప్రతినిధులు శుక్రవారం ఏపీ గవర్నర్, విశ్వవిద్యాలయాల కులపతి జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను అమరావతిలోని రాజ్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాలకు సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వానికి సహకరించిన గవర్నర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయాల్లోని సమస్యలు, మౌలిక వసతుల కల్పన తదితర విషయాలను విన్నవించారు. వర్సిటీల్లో అధ్యాపకుల రేషనలైజేషన్ వల్ల అనేక పోస్టులు తగ్గుతున్నాయని, దాన్ని నిలిపేయాలని విజ్ఞప్తి చేశారు. పాలక మండళ్లలో రాజకీయాలకతీతంగా విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలను నియమించాలని కోరారు. గవర్నర్‌ని కలసిన వారిలో ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగినేని రంగనాథ్, సభ్యులు ప్రొఫెసర్ ఆర్.రామచంద్రన్, బాలసుబ్రమణ్యం, రంజని, సంధ్య ఉన్నారు.

ఎస్వీయూలో పర్యావరణ విభాగాన్ని కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అకాడమిక్ కన్సల్టెంట్ కె.కిరణ్

తిరుపతి కల్చరల్: ఎస్వీ యూనివర్సిటీలోని ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగాన్ని కెమిస్ట్రీ విభాగంలో విలీనం చేయడం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020కు విరుద్ధమని, విలీనం ఆలోచనను విరమించుకోవాలని ఎస్వీయూ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమిక్ కన్సల్టెంట్ కె.కిరణ్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 1989లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపుతో ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగం ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు వందలాది మంది విద్యార్థులు ఎన్నో పరిశోధనలు చేసి ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో ఉన్నత హోదాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సు ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో కెమిస్ట్రీ విభాగంలో కలపడం సమంజసం కాదన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. ఈ మేరకు తాము రాష్ట్ర గవర్నర్‌కు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎన్విరాన్మెంటల్ విభాగం అకాడమిక్ కన్సల్టెంట్స్ కె.అబ్రహం, ఎం.శ్రీనివాసులు, పరిశోధక విద్యార్థులు వీరన్న ఆచారి, సురేంద్ర, త్రిపురేశ్వర్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న వడిత్యా శంకర్ నాయక్

తిరుపతి సిటీ: గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గిరిజనులు రుణపడి ఉంటారని ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. ఎస్వీయూ ప్రాంగణం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం సీఎం చిత్ర పటానికి విద్యార్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ విభజన హామీల సాధనలో ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణమే గొప్ప నిదర్శనమన్నారు. ప్రతిష్టాత్మక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం(సీటీయూఏపీ)కి 561 ఎకరాల భూమిని కేటాయించడంలో సీఎం చొరవ శ్లాఘనీయమన్నారు. పోర్టులు, మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నారని కొనియాడారు.

సీఎం జగన్‌తోనే దళితుల అభ్యున్నతి

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగు, బలహీనవర్గాలు, దళితుల అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ భావజాలానికి అనుగుణంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గతంలో భూ పంపిణీ పథకం చేపట్టారని, నేడు విజయనగరం జిల్లాలోని సాలూరులో గిరిజనుల కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. దళితులంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారని తెలిపారు.

సెప్టెంబర్ 8న సీపీఐ బహిరంగ సభ

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 8న తిరుపతిలో సీపీఐ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో అధ్యక్ష పాలన తీసుకొచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు. మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న అరాచకాలు, మారణకాండపై ప్రధాని మోదీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా సీపీఐ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా తిరుపతిలో సెప్టెంబర్ 8న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నటుట చెప్పారు. ఇందులో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, కార్యదర్శులు నారాయణ, ఎంపీ వినయ్ విశ్వం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారని తెలిపారు.

క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హరి మల్లికార్జున రెడ్డి, ప్రొఫెసర్ సరోజమ్మ

తిరుపతి సిటీ: క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యమని ఎస్వీయూ సాంఖ్యక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి.సరోజమ్మ తెలిపారు. ఎస్వీయూ సాంఖ్యక శాస్త్ర విభాగంలో శుక్రవారం ఫేర్ వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. నిరంతర కృషి, సాధించాలన్న తపన ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.హరి మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సాంఖ్యక శాస్త్ర విద్యార్థులకు బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు కె.మురళి, పి.రామకృష్ణ రెడ్డి, ఎం.నరేష్ పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై ఫిర్యాదు



అలిపిరి సీఐ అబ్బన్నకు ఫిర్యాదు చేస్తున్న జిల్లా సోషల్ మీడియా కన్వీనర్లు బాలిశెట్టి కిషోర్, శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా నారా లోకేష్ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్నాడని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బాలిశెట్టి కిషోర్ మండిపడ్డారు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురుద్దేశంతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నా డని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లోకేష్‌పై కేసు నమోదు చేయాలని శుక్రవారం అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో సీఐ అబ్బన్నకు ఫిర్యాదు చేశారు. అధికార దాహంతో చంద్రబాబు, లోకేష్‌లు ఎంతకైనా తెగిస్తారని, అందుకు మాచర్ల, పుంగనూరు ఘటనలే కారణమన్నారు. చంద్రబాబు, లోకేష్ వైఖరిని ఖండిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పోలీసులకు సోషల్ మీడియా నాయకులు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. జిల్లా సోషల్ మీడియా నాయకులు మైలం శ్రీకాంత్‌రెడ్డి, సర్వతేజ, సురేందర్, కొఠారి సుభాష్, జేసీఎస్ కన్వీనర్ మద్దాలి శేఖర్, అరుణ్‌యాదవ్ పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ భూమనను కలిసిన గాయని మంగ్లీ



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు తెలుపుతున్న గాయని మంగ్లీ

తిరుపతి మంగళం : టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని శుక్రవారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ప్రముఖ గాయని మంగ్లీ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ‹జగాలను ఏలే తల్లివే మా గంగమ్మ తల్లి› అంటూ తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా మంగ్లీ పాడిన పాట జగమంతా విన్నారంటూ మంగ్లీని మరోసారి కరుణాకరరెడ్డి అభినందించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ఆయన ఆశీర్వదించారు. ఇంప్రెస్ ఈవెంట్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మకు తుడా చైర్మన్ సారె



అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని సొరకాయలపాలెం హరిజనవాడలో మాతమ్మ కొలువును ఘనంగా నిర్వహించారు. తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శుక్రవారం ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు మంజుల, రాజేష్, నాయకులు భానుకుమార్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, కోటీ, ప్రతాప్, సెంథిల్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన సొరకాలయపాళెం హరిజన వాడకు చెందిన వెంకటరమణను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.

భారతీయ సంస్కృతి, సంస్కృత భాషను రక్షించుకుందాం



మాట్లాడుతున్న ఢిల్లీ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ సుబ్బారాయుడు

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృతి, సంస్కృత భాషను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఢిల్లీలోని సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వీసీ కేబీ సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శుక్రవారం సంస్కృత వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ సంస్కృత భాష పితృభాష అని, పితృసంపదగా, వారసత్వంగా పొందామని తెలిపారు. అటువంటి భాషకు ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలు జరగడం బాధాకరమన్నారు. ఆధునిక కాలంలో సంస్కృత భాషను మృతభాషగా వక్రీకరించడం దారుణమన్నారు. సంస్కృత భాష మృత భాష కాదని, మానవుని మరణం తర్వాత సైతం వెంటవచ్చి స్వర్గప్రాప్తినిస్తుందని చెప్పారు. సాహిత్యశాస్త్ర పండితులు కె.రామసూర్యనారాయణ మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయంతో దేశం ఆనందోత్సాహాల్లో ఉందన్నారు. భారత సనాతన ధర్మానికి సంస్కృతం మూలమన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మికమైన అంశాలు ఈ భాషలో ఇమిడి ఉన్నాయన్నారు. సంస్కృత భాషకు రాష్ట్రంలో ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాలు జరగడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ నందనరావు, దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు.

రష్‌లో అరుదైన సూప్రాలివేటర్ పిస్టులాకు శస్త్ర చికిత్స



బాధితుడితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి తుడా: తిరుపతిలోని రష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన సూప్రాలివేటర్ పిస్టుల అనే వ్యాధికి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్టు ఎమ్మెల్సీ, లేజర్ సర్జన్ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఆయన శుక్రవారం తమిళనాడు రాష్ట్రం అవడి ప్రాంతానికి చెందిన మనోహరన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మనోహరన్ చెన్నైలోని ఒక ప్రముఖ వైద్యశాలలో మొలలు, ఫిస్టులాకు శస్త్ర చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. అయినప్పటికీ పిస్టులా మళ్లీ తిరగబెట్టిందన్నారు. ఆయన తమ ఆస్పత్రికి వచ్చాడని తెలిపారు. పిస్టులా 10 సెంటీమీటర్ల లోతు వరకు మూడు శాఖోపశాఖలుగా విస్తరించినట్టు ఎంఆర్ఐ స్కానింగ్‌లో గుర్తించామన్నారు. మలద్వారం స్పింక్టర్‌ను దెబ్బతీసినట్టు తెలిపారు. ఇలాంటి ఫిస్టులా చాలా అరుదుగా ఉంటుందన్నారు. సమస్య ప్రారంభమైన వెంటనే శస్త్ర చికిత్స చేయించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ జబ్బు అత్యంత సంక్లిష్ట మైనదని తెలిపారు. దాన్ని సవాలుగా తీసుకుని అత్యున్నత ప్రమాణాలతో కూడిన రష్ సర్జికల్ జట్టు శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు.